చినుకు పడితే చిత్తడే..

● బురదమయంగా మారిన రోడ్లు
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాహనదారులు

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ పట్టణంలో గల కాలనీల రోడ్లన్నీ బురదమయంగా మారి ప్రజలు, వాహనదారులు వెళ్లలేని దుస్థితి నెలకొంది. వర్షాకాలం ప్రారంభమైతే చాలు రోడ్లన్నీ చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ప్రధాన రోడ్లు మినహా మిగిలిన రోడ్లన్నీ వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతున్నాయి. రోడ్లపై వర్షపు నీలవడంతో దోమలకు ఆవాసాలుగా మారి సీజనల్ వ్యాధులు మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వర్షం నీరు నిల్వ ఉండడం, మురుగు నీరు ఇళ్ల మధ్యలో చేరడంతో సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. వర్షాకాలం దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని, రోడ్లు, డ్రెయినేజీ నిర్మించేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.


దర్మన్న కాలనీలో చెరువును తలపిస్తున్న రోడ్డు


కాకతీయ కాలనీలో బురదమయంగా రోడ్డు

రోడ్ల సౌకర్యం కల్పించాలి



పట్టణంలోని వివిధ కాలనీలకు రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలి. వర్షాకాలం రోడ్లపైనే నిలిచి బురదమయంగా మారుతున్నాయి. రోడ్లపైనే నడవలేని దుస్థితి నెలకొని ఉంది. వాహనాలపై వెళ్లాలంటే భయపడాల్సి వస్తుంది. కాలనీల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలి.
- మాలోత్ రవీందర్, మానుకోట

ప్రతి పేదవాడికి రేషన్‌కార్డు మంజూరు


మహబూబాబాద్: రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్: గత ప్రభుత్వం పేదలకు కనీసం రేషన్‌కార్డులు కూడా మంజూరు చేయకుండా అన్యాయం చేసిందని, సంక్షేమ పథకాలు అన్ని రేషన్‌కార్డుతో ముడి పడి ఉన్నందున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేద వాడికి రేషన్‌కార్డు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. స్థానిక బ్రహ్మంగారి గుడి కల్యాణ మండపంలో బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు రేషన్‌కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అర్హులైన వారందరికి రేషన్‌కార్డుల మంజూరు కోసం కొంత ఆలస్యమైందన్నారు. రాబోయో ఎన్నికల్లో టికెట్ల విషయంలో ఇంటలిజెన్స్ రిపోర్ట్ ఆధారంగా చేసుకుని టికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, కమిషనర్ రాజేశ్వర్‌రావు, నాయకులు ఖలీల్, ఎడ్ల రమేశ్, పోతు రాజు, చలమల నారాయణ, నిమ్మల శ్రీనివాస్,పద్మం ప్రవీణ్, గిరిదర్ గుప్తా, లక్ష్మి, విజయలక్ష్మి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గూడూరు: అభివృద్ధి, ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరీ కల్యాణ మండపంలో బుధవారం అహార భద్రత కొత్త రేషన్‌కార్డుల పంపిణీ తహసీల్దార్ నాగభవాని అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో నెక్కొండ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏసీబీ సోదాలను స్వాగతిస్తున్నాం..

మహబూబాబాద్ అర్బన్: ఇటీవల జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో అవినీతిపై జరిగిన ఏసీబీ దాడులను ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘం స్వాగతిస్తుందని సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొన్నాల యుగేందర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. డిప్యూటేషన్ల పేరుతో రూ.లక్షల చేతులు మారుతున్నాయని, అవినీతిపరులను వదిలి పెట్టొద్దన్నారు. ఈ సమావేశంలో నాయకులు రఘు, శీను, మహేష్, సుధాకర్ పాల్గొన్నారు.

నూతన రైల్వే ప్లాట్‌ఫాం నిర్మించాలి


ధర్నా చేస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని కొత్త బజారు వైపు రైల్వే ప్లాట్‌ఫాం నిర్మించాలని సీపీఐ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. నూతన ప్లాట్‌ఫాం ఏర్పాటు, జనరల్ బోగీలను పెంచాలని, కొత్త రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో బుధవారం ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ.. కొత్త బజారు వైపునకు ప్లాట్‌ఫాం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని, మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు రైలు ఎక్కలేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మీ, మేక వీరన్న, కేదాసు రమేష్, వెలుగు శ్రావణ్, వీరవెల్లి రవి పాల్గొన్నారు.

ఉచిత బస్సు మహిళలకు వరం

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ప్రయాణ సౌకర్యం మహిళలకు వరమని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం వినియోగించుకున్న సందర్భంగా బుధవారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో సంబరాలు నిర్వహించారు. మహిళా ప్రయాణికులను, డ్వాక్రా మహిళలకు బహుమతులు అందించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎం పద్మావతి, అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్, ఎంపీడీఓలు మాట్లాడుతూ.. ఆర్టీసీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.


ప్రయాణికురాలికి బహుమతి అందజేస్తున్న అధికారులు

కార్యక్రమంలో ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, ఎంఎఫ్ విజయ్‌కుమార్, ఎంసీ గోపాల్‌రెడ్డి, ఎస్‌ఎం మల్లికార్జున్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుకు ఢీకొన్న ట్రాక్టర్.. ఇద్దరికి తీవ్రగాయాలు

కురవి: చెట్టును ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన కురవి మండలంలోని సూర్యతండా స్టేజీ వద్ద ఖమ్మం జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. తాళ్లసంకీస శివారు బీల్యా తండా గ్రామానికి చెందిన బానోత్ వీరన్నకు చెందిన ట్రాక్టర్‌ను నల్లెల్ల శివారు సూర్యతండా గ్రామానికి చెందిన అజ్మీరా శ్రీను నడుపుతున్నాడు. బీల్యాతండా వద్ద చేనులో పనిచేసుకుని సూర్య తండా వైపు వస్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ అజ్మీరా శ్రీనుకు కడుపులో తీవ్రంగా దెబ్బలు తగలడంతో రోడ్డు పక్కన స్పృహ తప్పి పడిపోయాడు. బానోత్ వీరన్నకు కుడి కాలుకు బలమైన గాయమైంది. గాయాలైన ఇద్దరిని అంబులెన్స్‌లో మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అజ్మీరా శ్రీనుకు పరిస్థితి బాగాలేదని తెలిసింది.

ఇద్దరికి 14రోజుల రిమాండ్

మరిపెడ రూరల్: కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరు ముద్దాయిలకు 14రోజులు తొర్రూరు కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్సై బొలగాని సతీష్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన కొమ్ము లింగయ్య, వీరారం గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకట్ నాయక్‌తండాకు చెందిన ధరంసోత్ హుస్సేన్ (వీరన్న) పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వీరు కోర్టు వాయిదాలకు హాజరుకావడంలేదు. వీరికి కోర్టు నాన్ బేలబుల్ వారెంట్ జారీ చేసింది. పోలీసులు వీరిని తొర్రూరు కోర్టులో హాజరుపర్చగా జడ్జి డి.ధీరజ్‌కుమార్ 14 రోజులు రిమాండ్ విధించి, జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్ రూరల్: నల్లబెల్లం, పటిక, గుడుంబా పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై వి.దీపిక బుధవారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. రాంసింగ్ తండాకు చెందిన దారావత్ బీమా ఇంట్లో నల్లబెల్లం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు రూరల్ ఏఎస్సై వెంకన్న, సిబ్బంది బాలరాజు, హుస్సేన్, రాజు తనిఖీలు చేపట్టారు. నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లం, 50కిలోల పటిక, 10లీటర్ల గుడుంబా లభ్యమయ్యాయి. రాంసింగ్ తండాకు చెందిన దారావత్ బీమా, వీరారం తండాకు చెందిన బానోత్ రవీందర్ కలిసి మానుకోట పట్టణ శివారు బాబునాయక్ తండాకు చెందిన భూక్య అరుణ్ వద్ద నల్లబెల్లం కొనుగోలు చేసి తీసుకువచ్చి గుడుంబా విక్రయదారులకు అమ్ముతున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్సై దీపిక తెలిపారు.

క్లుప్తంగా

ఇంటెలిజెన్స్ అధికారుల భవనాలు సిద్ధం

మహబూబాబాద్ రూరల్ : ప్రభుత్వం, పోలీసు శాఖతోపాటుగా వివిధ శాఖల పనితీరుపై కీలకంగా వ్యవహరించే ఇంటెలిజెన్స్ అధికారులు, సిబ్బంది విధుల నిర్వహణ, కార్యకలాపాల అవసరాల నిమిత్తం జిల్లా కేంద్రం శివారులో నిర్మించిన సీఐ, ఎస్సైల భవనాల నిర్మాణ పనులు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. అనంతాద్రి రోడ్డులోని ఎక్సైజ్ స్టేషన్ సమీపంలో ఇంటెలిజెన్స్ సీఐ, ఎస్సైల భవనాలను నిర్మించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

డోర్నకల్: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా నాయకుడు సోమనబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఇమ్మానియల్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్, నాయకులు శంకర్, సాహెబ్‌అలీ, అమీనా, సీతారాములు, సురేందర్, రాములు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



కేసముద్రం: మండలంలోని బిచ్చానాయక్‌తండాలో తీజ్ పండుగ వేడుకలు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్ హాజరయ్యారు. గిరిజన మహిళలతో కలిసి ఆటాపాటల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, రావుల మురళీ, వెంకన్న పాల్గొన్నారు.

కవి సమ్మేళనంలో సత్తా చాటిన సతీశ్



దంతాలపల్లి: మండలంలోని రామానుజపురం గ్రామానికి చెందిన చిర్ర సతీశ్ కవిత్వంలో సత్తాచాటాడు. మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. పోటీలో పాల్గొన్న సతీశ్ సత్తాచాటి ఎమ్మెల్సీ కవిత, కృష్ణమాచార్యుల కుమారుడు లక్ష్మణ్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

ఏకాదశ రుద్రాభిషేకం



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో తొలిసారిగా పాయిలి రాజేశ్వర్‌రావు-యాదమ్మ దంపతుల ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమాన్ని పవిత్ర నదీజలాలతో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యనారాయణ, ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్, చిత్తనూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

నెహ్రూసెంటర్: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వర్‌రావు, కాళోజీ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు మైస శ్రీనివాసులు అన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు బుధవారం న్యూట్రీషన్ కిట్లను పీహెచ్‌సీలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, తోట శ్రీనివాస్, పాశం మల్లారెడ్డి, కిషన్‌నాయక్, విద్యాసాగర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



నెల్లికుదురు: మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం కిసాన్ పరివార్ వ్యవస్థాపక అధ్యక్షుడు ననావత్ బూపాల్ నాయక్ రూ.2లక్షల విరాళం అందించారు.

డీసీసీ అధ్యక్షుడిగా అవకాశం ఇవ్వాలి

తొర్రూరు రూరల్: కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు టి.కుమార్‌రావుకు వినతిపత్రం అందించారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం


మహబూబాబాద్ అర్బన్: మోడల్ స్కూల్‌ను బంద్ చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు


మరిపెడలో..


తొర్రూరులో..

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని బుధవారం ఐక్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈసందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు.
- సాక్షి నెట్‌వర్క్

మెనూ ప్రకారం భోజనం అందించాలి


భోజనం పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణవేణి

కొత్తగూడ: విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఆర్డీఓ కృష్ణవేణి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల, బాలికల ఎస్‌ఎంహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, విద్యార్థులకు వండుతుకున్న కూరగాయలు పరిశీలించారు. వంట గదులు, కూరగాయలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. పిచ్చి మొక్కలు ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. డీపీఆర్‌ఓ ప్రేమ్‌కుమార్, తహసీల్దార్ రాజు పాల్గొన్నారు.

రోజంతా ముసురు

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బుధవారం పలువాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల చెరువులు మత్తళ్లు పోస్తున్నాయి. భారీ వృక్షాలు నేల కూలాయి. విద్యుత్ స్తంభాలు విరగడంతో విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.
- సాక్షి నెట్‌వర్క్


గార్ల: విరిగిన విద్యుత్ స్తంభం


గార్ల: వాటర్‌ట్యాంకు బజారులో కూలిన చెట్టు


గార్ల: పాకాల ఏటి వద్ద సీఐ బి.రవికుమార్


గంగారం: కోమట్లగూడెం గ్రామంలో మత్తడి పోస్తున్న చెరువు


కొత్తగూడ: ఉధృతంగా ప్రవహిస్తున్న మొండ్రాయిగూడెం వాగు


నెల్లికుదురు: రాజులకొత్తపల్లి పరిధిలోని కల్వర్టును పరిశీలిస్తున్న ఆర్డీఓ రమేష్

సంక్షిప్త సమాచారం

అంగన్‌వాడీ ఆయా మృతి

డోర్నకల్: స్థానిక సుభాష్ స్ట్రీట్-2 అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా విధులు నిర్వహిస్తున్న ఆవుదుర్తి మల్లికాంబ(65) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. మల్లికాంబ అంత్యక్రియల కోసం సీడీపీఓ లక్ష్మి రూ.10వేల ఆర్థికసాయం అందించారు.

కట్టు కాల్వను కాపాడాలి

దంతాలపల్లి: మండలంలోని రేపోణి గ్రామంలో చెరువుకు నీళ్లు వచ్చే కట్టు కాల్వను కాపాడాలని రేపోణి రైతులు బుధువారం తహసీల్దారు సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కట్టు కాల్వ ఆక్రమణకు గురికావడంతో చెరువులోకి నీళ్లు రావడం లేదన్నారు. కార్యక్రమంలో రైతులు వీరారెడ్డి, వెంకన్న, గణేష్, నర్సయ్య పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించాలి

గార్ల: పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం గార్ల పాకాల ఏటి వద్ద మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, శీలంశెట్టి రమేష్, ఉమేష్, వెంకట్, కిరణ్, విజయ్ పాల్గొన్నారు.

కుర్చీల బహూకరణ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని హజారియాతండా ఎంపీపీఎస్ విద్యార్థులకు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ స్వాతిసుమన్ బుధవారం కుర్చీలు బహూకరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీరాములు, టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాసులు, హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరదనీరు పరిశీలన

డోర్నకల్: స్థానిక మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం మున్సిపల్ సిబ్బంది పరిశీలించారు. పాఠశాల పక్కన భారీగా వరదనీరు నిలవడంతో మున్సిపల్ సిబ్బంది నాగరాజు, సురేష్, కిశోర్, సాయి తదితరులు పాఠశాల ప్రిన్సిపాల్ రిజ్వానాతో కలిసి పరిశీలించారు. వరదనీటిని తొలగించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడతామని మున్సిపల్ సిబ్బంది తెలిపారు.

దిగబడిన మినీ టిప్పర్

గంగారం: మండలంలోని కోమట్లగూడెం వంతెన నిర్మాణ పనులు వద్ద తాత్కలికంగా రోడ్డులో ఇటుకలోడుతో వెళ్తున్న మినీ టిప్పర్ దిగబడింది. అనంతరం జేసీబీతో టిప్పర్‌ను బయటకు తీశారు.

అప్రమత్తంగా ఉండాలి

డోర్నకల్: భారీవర్షాలు, వరదలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ పూర్ణచందర్ కోరారు. సీరోలు మండలం దుబ్బతండా, మోదుగ్గడతండా పరిధిలోని ఆకేరువాగును బుధవారం పరిశీలించిన తహసీల్దారు రెండు గ్రామాల ప్రజలతో మాట్లాడారు.

సైబర్ నేరాలపై అవగాహన

కురవి: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీరోలు ఎస్సై సంతోష్ అన్నారు. బుధవారం సీరోలు మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో సైబర్ క్రైంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

చిన్నగూడూరు: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని పగిడిపల్లి శివారు బావోజీతండా పంటపొలాల్లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బావోజీతండాకు చెందిన రైతు బానోత్ భాష్యకు చెందిన ఎద్దు బుధవారం మేతకు వెళ్లింది. పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడంతో ఎద్దు మేత మేస్తూ 11కేవీ బుష్‌రాడ్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని బాధిత రైతు తెలుపుతున్నాడు.

రేషన్‌కార్డుల పంపిణీ

తొర్రూరు రూరల్: రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో అన్నివర్గాల పేదలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. బుధవారం మండలంలో అరిపిరాలలో రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.

విద్యార్థినికి సన్మానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని హనుమంతుని గడ్డకు చెందిన బాల్ బ్యాడ్మింటన్ జాతీయ క్రీడాకారుడు తప్పెట్ల రవి సులోచనల కుమార్తె మౌనిక నెట్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మౌనికను హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో సన్మానించారు.

25 కిలోల ఎండు గంజాయి పట్టివేత

నెల్లికుదురు: అక్రమంగా తరలిస్తున్న 25 కిలోల ఎండు గంజాయిని పట్టుకుని ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై చిర్ర రమేష్ బాబుతో కలసి తొర్రూర్ సీఐ గణేష్ బుధవారం వెలడించిన వివరాల ప్రకారం.. అక్రమంగా ఎండుగంజాయి తరలిస్తున్నట్లు వచ్చిన నమ్మదగిన సమాచారంతో నెల్లికుదురు మండలంలోని దుర్గాభవాణి తండా క్రాస్ రోడ్ వద్ద నెల్లికుదురు మహబూబాబాద్ ప్రధాన రహదారిపై పోలీసు సిబ్బందితో వాహనాల తనిఖీలు నిర్వహించా రు. అదేసమయంలో అనుమానాస్పదంగా వెళ్తు న్న కారు, ఆటోను తనిఖీ చేసి రూ.12.55 లక్షల విలువ చేసే 25 కిలోల ఎండు గంజాయిని గుర్తించారు. వాహనంలో ఉన్న వారిని విచారించగా మండలంలోని ఆలేరు గ్రామానికి చెందిన మేకపోతుల వేణుగోపాల్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ గ్రామానికి చెందిన ఉప్పుగండ్ల ప్రభాకర్, ఒడిస్సా రాష్ట్రం మల్కానగిరి జిల్లా చిత్తూరుకొండ గ్రామానికి చెందిన బారీ రాజబాబు, ఇదే జిల్లాకు చెందిన దీపక్ పటేల్, మధ్యప్రదేశ్ రాష్ట్రం తగునాపూర్ జి ల్లా సెలాహో గ్రామానికి చెందిన రోహిత్ కుమార్ జస్వాల్, గోదావరి జిల్లా రాజమండ్రి మండంల బల్లవారి స్వీట్ గ్రామానికి చెందిన రంకిరెడ్డి వెంకటస్వామి, రాజస్థాన్‌కు చెందిన రాంలాల్‌లు కలిసి గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. జైలు లో కలుసుకున్న వీరంతా ఒడిస్సా నుంచి హైదరా బాద్‌కు గంజాయిని తరలిస్తూ పట్టుపడ్డట్లు తెలిపా రు. ఏడుగురిపై కేసు నమోదు చేసి గంజాయి, వాహనాలను సీజ్ చేసి ఏడుగురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

బాలల హక్కుల కోసం పాటుపడాలి

నెల్లికుదురు: బాలల హక్కుల పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అనీ, అందుకోసం పాటుపడాలని తహసీల్దార్ చందా నరేష్, ఎస్సై చిర్ర రమేష్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రటరీ దొనికన కుమారస్వామి, డీటీ తరంగిణి పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
ఐ. సతీష్ (S.R) (డోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646